
# చరమాంకం

ఎస్.రాజేశ్వరి



అబ్బబ్బ!...ఈ ముసలాళ్ళతో చావొచ్చిపడింది. బతికుండీ పీక్కుతింటారు. చచ్చాక పీక్కుతింటారు. ఒక్క క్షణం ఊపిరి సలపనివ్వరు. అసలే రేపు తన బర్త్‌డే...ఎల్లుండి మ్యారేజ్‌డే వున్నాయి. భర్తకి తెలిసీకొంత, తెలవక కొంతా అప్పోసొప్పో చేసి, ఓ రెండు చీరలు తెచ్చుకుంది. పొద్దున్నే బాబిగాడ్ని బడికీ, ఆయన్ని ఆఫీసుకు పంపి తలంటుకుని కొత్తచీర కట్టుకుని, ఓ రెండు స్వీట్లు తీసుకుని అలా పక్కవీధిలోవున్న పుట్టింటికి వెళ్ళాలనుకుంది. ఇంతలోకే ఈ అవాంతరం వచ్చి తగులడింది. ఇక వెళ్ళేదేమిటి?

అసలే అమ్మకి ఒంట్లో బాగుండటల్లేదంట. అన్నా, ఒదినలున్నారు.. బ్రహ్మరాక్షసులు... ఇద్దరికిద్దరే. అన్నగార్లు సరేసరి. హయ్యేరాత..మన బంగారం మంచిదికాకనేకదా...వాళ్ళ ...వాళ్ళ పెళ్ళాలకొంగు వదలరు. అందుకే... అమ్మకి నాన్నకీ వాళ్ళతో పడక వేరే వుంటున్నారు. పడ్తూ లేస్తూ.. ఇంత ఉడకేసుకుతింటునారు. తన చెల్లెలుందిగానీ ఏం ప్రయోజనం. ఎక్కడో దూరంగా వుంటుంది. ఆ అత్త, మొగుడు సరేసరి. కాల్చుకు తినేస్తారు. ఎప్పుడో నూటికోసారి వచ్చి వెడుతుంది. కాస్త దగ్గర్లో వున్నది తనేకదా..అలనా పాలనా చూస్తూ వుంటుంది. ఇంట్లో ఈ ముసలాళ్ళతో తీరికేవుండి చావదు. వెధవ సంత. ఇప్పుడిదొచ్చి పడింది.

మామగారికి...వినీ వినపడనట్లు సణుగుతూనే ఇల్లంతా సర్దటం మొదలుపెట్టింది కోడలు వసుంధర.

అంతా వింటూనేవున్నా..ఏమి అనలేని మామగారు..రాయిలాకూర్చున్నాడు. చెవులు వింటున్నా మెదడు పని చెయ్యటల్లేదు. కళ్ళు చూస్తున్నా నీళ్ళు రావటల్లేదు.

బతికివున్నాళ్ళు మందనీ మాకనీ..కాల్చుకు తింటారు. చచ్చాక మాసికాలనీ, తద్దినాలనీ పీక్కుతింటారు. ఆస్తులివ్వకపోయినా, అప్పలపాలుచేసి పోతారు. పెళ్ళి పేరుతో కొడుకుల్ని అమ్మేసుకుని, కోడళ్ళతో గొడ్డు చాకిరీ చేయించుకుంటారు. దీనికి తోడు కూతుళ్ళొకటి.. తగుదునమ్మా అని మూడు మూడురోజులకే తగులడి, ఉన్నవిలేనివి ఊడేసుకుని పోతుంటారు. ఇక్కడేదో ఆస్తులు మూలుగుతున్నట్లు.. ఇల్లంతా కాలుగాలిన పిల్లిలా.. రుసరుసలాడుతూ.. తిరిగి.. తిరిగి అన్నీ చక్కబెట్టుకుంటోంది. ప్రతిదీ జాగ్రత్త పరుచుకుంటోంది. అవును మరి ఈ హడావుడిలో ఎన్నిపోతాయో... నలుగురు వచ్చి నాలుగు చక్కబెడితే ఇల్లంతా గుల్లే. అసలే ఆడబడుచులిద్దరు, లేకిమొహాలే. వాళ్ళకెన్ని వున్నా తనింట్లో సామాన్లే నచ్చుతాయి. చూపింది చూపినట్లే ఊడేసుకుపోవాలని... పెద్ద.. తాపత్రయం... అయినా తను మాత్రం ఏంతక్కువ కాదు. ఇవన్నీ మీ అన్నయ్య ఇష్టంకొద్దీ కష్టపడికొన్నారు అని తెలివిగా తప్పించుకుంటుంది.

"అమ్మా...నానమ్మ ఎందుకే... పాపం... అలా పడుకుంది? జొరం ఇంకా తగ్గలేదా?" దిగులుగా అడిగాడు తల్లిని వాటేసుకుంటూ అప్పుడే బడినుంచి వచ్చిన పదేళ్ళ బాబిగాడు.

"ఫో... వెధవా ఎప్పుడు నానమ్మగొడవే. నాన్నమ్మంటే అంత పడిచస్తావెందుకు? బయటికి తగలడు. పనీ పాటలేదా? కాస్త టిఫిన్ తిని.. అలా ఆడుకుందుకు తగులడు" ఒళ్ళు కసురుకసిరింది వసుంధర.

పాపం... పసివాడు చిక్కమొహంవేసి... మరోసారి నాన్నమ్మ వైపు దీనంగా చూసి బయటికి వెళ్ళిపోయాడు.

ఛీ... అమ్మ ఎప్పుడూ ఇంతే. అమ్మమ్మకైతే అన్నీ పట్టుకెళ్ళి మెక్కబెడుతుంది. గంటలు గంటలు బోలెడు కబుర్లు చెపుతుంది. మరి నాన్నమ్మని మాత్రం ఎప్పుడూ విసుక్కొంటూ, తిడుతూ వుంటుంది. తిండికూడా సరిగ్గా పెట్టదు. తను మాత్రం చాటుగా దాచుకుని దాచుకుని పొయ్యి దగ్గర వండుతూ వండుతూ తినేస్తుంది. నాన్నకి కూడా ఎప్పుడో పెడ్తుంది. తాతయ్య సరేసరి. ఏదీ పట్టించుకోడు. నాన్నమ్మ చూసినా చూడనట్లు నటిస్తుంది. తనేదైనా అడిగితే... పైనుంచి తననే తిడుతుంది. ఈ మధ్య బొత్తిగా జొరంతో పడివుంది నాన్నమ్మ. తనకెందుకో దిగులుగా వుంది. కధలు కబుర్లు చెప్పటల్లేదు. దగ్గర పడు

కోనివ్వటల్లేదు. అమ్మ పెట్టేవన్నీ తినకుండా నాకే దాచివుంచి పెడ్తుంది. పాపం. ఇవ్వడసలు తనకే ఎవరు ఏంపెట్టటల్లేదు. నాకేం పెడుతుంది?

అసలు తనకి నాన్నమ్మంటేనే ఎంతో ఇష్టం. అమ్మా, నాన్న తిట్టినా, కొట్టినా ఎత్తుకుని లాలించి అన్నీ తినిపించి... పక్కలో పడుకోబెట్టుకుంటుంది. చందమామ కథలన్నీ చెప్తుంది ఎంతో ప్రేమగా గుండెల్లో దాచుకుంటుంది.

"తాతా...తాతా...నాన్నమ్మకింకా జ్వరం తగ్గలేదా?" కుదిపి కుదిపి...అడిగాడు. అక్కడే అరుగు మీద దిగాలుగా కూర్చున్న తాతని. అవునన్నట్లు మూగగా తల ఆడించాడు. ఎందుకో ఆ వాతావరణంలో ఉండబుద్ధికాలేదేమో.. పసివాడు.. అలా బయటికి వెళ్ళిపోయాడు స్నేహితుల దగ్గరికి.

* * * *

"వెధవ... వేలెడులేడు అన్నీ ప్రశ్నలే. ఎప్పుడు నాన్నమ్మగోలే. ఇంకెవరు పనికిరారు. దెయ్యం అంత తల్లిని ఎదురుగా తగులడ్డానుగా... ఆ ముసల్దాని గోలెందుకు?" తమా తనవాళ్ళూ అమృతం తాగినంత విశ్వాసంతో... తిట్టుకుంది. అన్నీ వెధవ బుద్ధులే. పసివాణ్ణి ఆకట్టుకుని తనకి కాకుండా చేసి, తల్లినించి వేరుచెయ్యాలని కాకపోతే .. ప్రేమ ఒరిగిపోయిందేమిటి? తను దాచివుంచిన ఆస్తులన్నీ అందించాలనా? ఇదంతా వంగనాచిబుద్ధులు. ప్రేమా పాడా? ఈ ముసలాళ్ళందరికీ ఇదే రోగం. అక్కడికి తల్లులేదో గయ్యాళి పీనుగులైనట్లు... పిల్లల మనస్సుల్లో మారిపొయ్యటం.

అయినా, చుట్టు పక్కల వాళ్ళంతా, కొడుకులకి... కార్లు, మేడలు, ఆస్తులు అన్నీ అమర్చి వుంచారు. వీళ్ళేముంచారని? వున్న ఈ వెలిసిపోయిన పాత కొంప తప్ప? చేసిన బోడి ఉద్యోగంతో కూతుళ్ళ పెళ్ళిళ్ళు చేసాడు. ఇంకానయం. ఆ తద్దినం కూడా మానెత్తినే పెట్టకుండా ఈ కొంపా ఓపాత డొక్కు స్కూటరు మిగిల్చాడు. రిటైర్ అయ్యాక కొడుక్కి వచ్చిన ఉద్యోగం. ఇంతేగా మిగిల్చిన ఆస్తి. ఆవార, ఇద్దరి ఖరువు.. తిండెట్టి మేపటంతోనే సరిపోతోంది. ఇంక మిగిల్చిందేముంది వచ్చింది. అందరికీ... ముందు తోటికా బాంకిల్లో మూలుగుతున్నాయ్. పెద్ద... ఏదో నిలవుంచినట్లు... మందులు మాత్రం కావాలి? అందుకే అత్తగారు నాల్గురోజుల్నుంచి రోగంతో మూలుగుతున్నా... నిజం చెప్తొద్దు... కావాలనే తను భర్తకి చెప్పలేదు.

ఆవిడ లేచివెళ్ళి కొడుకుని అడుక్కోలేదు. ఆ మామగారు... పరేవరి... అంత పట్టించుకుంటే ఇకనేం? అందుకే జ్వరంగా వున్నాతను...తనంతతానుగా చెప్పలేదు. చెప్తే మళ్ళీ వందలు వందలు వైద్యం చేయించాలి ఎక్కణ్ణుంచొస్తాయ్? ఈవిడ మిగిల్చిన ఎస్టేట్లు మురిగిపోతున్నాయనా?...ఇంకా ఎన్నాళ్ళు బతకాలని? చాకిరీ చెయ్యలేక చస్తుంటేనూ... ఇంకా ఇంకా బతికి ఇక్కడ ఎవర్ని ఉద్ధరించాలి? వున్న కొద్ది అప్పలపాలు చెయ్యటమేగా. అప్పులు పంచుకోకపోయినా, ఉన్న కొద్దీగొప్పో పట్టుకుపోవటానికి... ఇద్దరప్పలుండనే వున్నారు... ఇంక దిగుతారు. ఛీ..ఛీ.. వెధవ బతుకులు ఒక్కనాడు సుఖంగా బతకనియ్యరు. ఏదో మనమ్మాయి కొద్దో గొప్పో సొంత ఇల్లు, తిరగటానికోబండి... బాధ్యతలు లేవు అని మనలా అద్దె కొంపల్లో... ఖాళీ కడుపుల్తో... బ్రతుకఖర్లేదు కదా కొంచమైనా సుఖపడుతుందని... కట్టబెట్టాడు నాన్న. రాక్షసుల్లాంటి ఒదిన గార్ల మధ్యనుంచి... బాధ్యతలెరుగని అన్నగార్ల స్వార్థం నుంచి బయటపడిందే చాలనుకుంది. ఏం సుఖపడి చచ్చిందవీ... గానుగెద్దు బతుకు... ఇవ్వడికే చాలా ఆలస్యమైంది. భర్తకి ఆఫీసుకు ఫోన్ చేసి రావాలి...అనుకుంటూ... ఇల్లంతా సర్దుకున్నట్లే కదా. ఖరీదైనవన్నీ జాగ్రత్త చేసుకున్నాంకదా... హమ్మయ్య... అనుకుంటూ తలుపులు ఓరగా వేసి... అక్కడే వున్న మామగారికి చెప్పి... అలా రోడ్డుమీదకి బయల్దేరింది.

ఫోనులో భార్యగొంతు విన్న శంకరం ఉలిక్కిపడ్డాడు "నిజంగానే చెప్తున్నావా? సరిగ్గా చూసావా? భయం భయంకా అడిగాడు భార్యనుద్దేశించి. అతడికి గుండెల్లో రాయిపడింది. ఇప్పడెలా? బోలెడు ఖర్చు ఇప్పడిప్పడే కాస్త కోలుకుంటున్నాడు. అప్ప చేసి కొన్న ఖరీదైన సామాన్లవి. ఇంకా ఇన్‌స్టాల్‌మెంట్లు పూర్తి కానేలేదు. పులిమీద పుట్రలా ఇదోఖర్చు. ప్చ్! తప్పేదేముంది? సరే నేను త్వరగా వస్తున్నాను. మళ్ళీ చీకటిపడితే కష్టం అంటూ ఫోను పెట్టేసి, అక్కలిద్దరికి ఫోనుచేసి, ఆఫీసరికి సంగతంతా చెప్పి లీవ్‌లెటర్ ఇచ్చేసి ఇంటిముఖం పట్టాడు.

ఇంట్లో అడుగు పెడ్తూనే ఏం చెయ్యాలో అర్థంకాలేదు శంకరానికి. మతిలేనివాడిలా ఓసారి ఇల్లంతా కలయతిరిగి... "అలా రోడ్డు మీద డాక్టర్ని పిలవలేకపోయావా?" అడిగాడు.

"ఎందుకండీ! అదోదండగ... ఆ మాత్రం తెలవదా ఏమిటి? ఇంకా ఎవరికీ చెప్పలేదు. ముందా ఏర్పాట్లు చూడండి. మళ్ళీ చీకటిపడితే కష్టం. హెచ్చరించింది వసుంధర.

కట్టెలావడివున్న తల్లిని చూడగానే... గుండెలు దడదడమన్నాయ్. ఎముకలగూడులా నిర్జీవంగా పడివుంది. ఆ గూటిలో పెరిగిన తను...ఆ క్షీరం తాగి పెరిగిన తను...తను...ఒక కొడుకా? ఇందుకేనా తనని...అంత అపురూపంగా, అంత ప్రేమగా... పెంచింది అమ్మ? "అ...మ్మ'...అన్న అక్షరాలు...గుండెలోతుల్లోంచి మమతల తరంగాల్లా, కట్టలుతెంచుకుని... హృదయంద్రవించి...ఒక్కసారి ఉప్పెనలా కన్నీటి రూపంలో చెంపలు నిండిపోయాయ్. అమృతం అంటే అమ్మలానే ఉంటుందేమో...తనొక కొడుకా? అమ్మ విలువ అప్పడర్థమైంది... భార్య మాటలు వెగటుగా అనిపించాయ్. అవును మరి. ఆమె తల్లికాదుగా... "అమ్మని తనెంత నిర్లక్ష్యం చేశాడు..." దుఃఖం కట్టలు తెంచుకోగా... దోసిట్లో ముఖం దాచుకున్నాడు. కుమిలి కుమిలి ఏడ్చాడు. పాతికేళ్ళు పెరిగి పెళ్ళయిన ప్రతి మగవాడు... తల్లిని మర్చిపోవడం సహజం. అమ్మ చేతి అమృతం తాగి... తాగి... భార్యచేత విషమే తాగినా... ఆ పంచన పడక తప్పదు. అది మగవాడి బలహీనత. తన స్వార్థం కోసం భర్తల్ని హత్యచేసిన భార్యలు లేకపోలేదు. అయినా అది ఒక ఆకర్షణ. అమ్మ విలువ తెలిసేది, మైకం వదిలాకనే. అయితే విలువలు తెల్సినా... పైబడిన బాధ్యతలు ఆలోచించనియ్యవు. తండ్రి మొహంలోకి చూడలేక... పక్కకి తప్పకున్నాడు. కొన్ని గంటల్లో రావలసిన వాళ్ళంతా వచ్చారు. ముందు కార్యక్రమాలకంతా సిద్ధం చేస్తున్నారు.

"ఆ ... వెళ్ళినా తెచ్చుకుందుకేముందని? ఒంటెడు నగలు, బీరువా నిండా చీరలు, ఇంటెడు సామాను ఏం లేదు. ఉన్న కొద్దిపాటి ఒదినగారు సర్దేశివుంటుంది. ఇంకెందుకు? కాకపోతే, తల్లి గనుక ఆఖరిచూపుకోసం అన్నట్టు... కూడబలుక్కుని వచ్చారు ఆడపిల్లలిద్దరు. వచ్చినందుకు తల్లి... శవం కనబడగానే సహజంగానే దుఃఖం... వెల్లువలై ప్రవహించింది... తల్లీ పిల్లల బంధం కదా....

"ఓ బరువు తగ్గింది. ఓ చాకిరీ తప్పింది" హాయిగా, స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుంది కోడలు వసుంధర.

'నాన్నమ్మ చచ్చిపోయింది... ఇంక తనకెవరున్నారు? తనెక్కడ... ఎవరి దగ్గర పడుకోవాలి?

పోటీ

ఇటీవల సంజయ్‌కపూర్ తన గర్ల్‌ఫ్రెండ్‌కోసం ఒక పార్టీ ఇచ్చాడు. ఆ పార్టీలో ఒక పాటకు అందరూ డాన్స్ చేస్తుంటే అతను మాత్రం కట్టెలా నించున్నాడు. ఏంటయ్యా సంగతి అంటే ఆ పాట 'జాజార్' చిత్రంలో సల్మాన్‌దట. ('జాజార్'లో సల్మాన్, సంజయ్ కలిసి నటించారు.)



అమ్మ నాన్న కొట్టినా, తిట్టినా, నానమ్మ పక్కలో హాయిగా పడుకునేవాడు. ఇంక తన్నెవరు ఆడిస్తారు? తనకి మంచిమంచి కథలెవరు చెప్తారు? నానమ్మని పట్టుకుని పోతారంట. కట్టెలతో కాల్చేస్తారంట. ఇంక నాయనమ్మ రాదంట. తన దోస్తు సీనుగాడు చెప్పాడు. వాళ్ల నానమ్మను కూడా అంతే చేశారంట. అందుకే ఇంక రాలేదంట. పాపం! నానమ్మ అంటిస్తే మండిపోదూ... వేడిగా కాలిపోదూ?" పసివాడి చెంపలమీద కన్నీళ్ళ చారలు కట్టాయ్. వెక్కివెక్కి ఏడుస్తున్నాడు.

ప్రేమానురాగాలు రంగరించి పెద్దచేసిన... నీకే ఇన్ని తిప్పలు... చివరి క్షణాల్లో నిన్నే అందరు ఇంత నిర్లక్ష్యంగా చూస్తే... అమ్మ అన్న అభిమానం కూడా లేని.. పిల్లలు... ఒక్క కొడుకని అతిగారం మహాగారం చేస్తే... చివరి దశలో... గుక్కెడు మందు చుక్క పోసినవాళ్ళు లేరు. అమ్మాయిల పురుళ్ళకీ పుణ్యాలకీ అలసిపోయి చాకిరీచేసి, కడుపుతో వుందని కొన్నాళ్లు, బాలింతరాలని కొన్నాళ్ళు... ఒక్క కోడలని అపరూపంతో ఓపికున్నన్ని రోజులు... కూడబెట్టి.... మేపిమేపి చాకిరీ చేశావే.. మనవణ్ణి చంక దింపకుండా ముద్దుమురిపాలు కురిపించావే.. అలాటి నువ్వు... దుఃఖానపడితే... నీకు జరిగిందేమిటి పార్వతీ. మందేస్తే డబ్బు ఖర్చవుతుందని... నాన్నమ్మ అని నోటినిండా .పిలిస్తే బంధం, పెరిగిపోతుందని... ఆస్తులు అంతస్తులు ఇవ్వలేదని, నీ చేతి వంట తిని నిన్ను వస్తు పడుకోబెట్టారే... నీ ఇంటిని ఆక్రమించుకుని నిన్ను వెలివేశారే... నీ కొడుకుని... అదే నువ్వు కంటికి రెప్పలా అతిగారంగా పెంచుకున్న కొడుకుని ఆకట్టుకుని... నీ మంచి ప్రేమని విరిచేశారే... ఇది... ఇదంతా ఏమిటి పార్వతీ? ఈ అవసాన దశలో అందరూ ఇంతేనా? వార్ధక్యంలో ప్రతి తల్లిదండ్రుల గతి ఇదేనా? ఈ కసుర్లు, విసుర్లు, విరసనలు, హేళనలు, ఛీత్కరింపులు, తిరస్కరింపులు, ఇలా భరిస్తూ... మన తెలివితేటల్ని, మంచి చెడ్డల్ని, ఆత్మాభిమానాన్ని.. బలవంతంగా పాతిపెట్టి... గుండెల్ని పిండే ఈ బాధల్ని భరిస్తూ... ఇలా బరువు బ్రతుకుల్ని ఈడ్చాల్సిందేనా? అంతవరకు అన్నివిధాలా అండగావున్న తల్లిదండ్రులు వయసు పైబడగానే పనికిరాకుండా పోవడం శోచనీయం.

ప్రేమాభిమానులకీ, ఆప్యాయతానురాగాలకీ, కలిమిలేములు కొలతలు కావు. ఈ అవసాన దశలో అవి లభించే అదృష్టవంతులు చాలా అరుదు.

గడిచిన జీవితంలో మధుర స్మృతులను నెమరువేసుకుంటూ పిల్లలు, మనవలు... అందరి మధ్య ఆదరాభిమానాలు పొందుతూ.. హాయిగా ఆనందంగా.. ఈ చరమాంకాన్ని గడపగలిగిన అదృష్టవంతులు... ప్చ్... ఊహాతీతమే... అమ్మగా నీకింత... గొప్పగా ... ఈ దశ... హు... ఇక తండ్రిగా నాగతేమిటి? నీకేం? నువ్వు పచ్చగా పదిమందిలోంచి పయనమయ్యావ్.. అదృష్టవంతురాలివి పార్వతీ.... నువ్వు పోయావన్న బాధకంటే... భయపెడుతున్న నా వంటరితనం... ఈ బ్రతుకెలా ఈడ్చాలా అన్న బాధ.. ఎక్కువగా వుంది పార్వతీ... నువ్వు లేవన్న బాధకంటే... వున్న నేను ఎలా బ్రతకాలన్నదే... బాధ...

ఉదయం నుంచి, మౌనంగా మూగవాడిలా అంతా తిలకిస్తున్న పార్వతి భర్త రామనాధం భార్య పాడిని నలుగురు పైకెత్తగానే... అంతవరకు నిగ్రహించుకున్న దుఃఖం తెరలు తెరలుగా కట్టలు తెంచుకుని... వెర్రిచూపులు చూస్తున్న కళ్ళ వెంట ఉబికి ఉబికి... రాలుతుంటే బలవంతాన కండువా అడ్డం పెట్టుకున్నాడు... పాపం! రామనాధం. ☆


# చెట్టు నీడ

హృదయ గాయాలకి
వైద్యాలుండవు
శస్త్ర చికిత్సలూ
శాస్త్ర చికిత్సలూ
పనికిరావు.

సేద తీర్చే
పచ్చిక మనస్సు కావాలి

ఊయలలూపే
మలయానిల ఆగమనం కావాలి

ధైర్యం చెప్పి
బ్రతుకును పెంచే
ఆత్మీయతల ఆలంబన కావాలి



ఉచ్ఛ్వాస నిశ్వాసాల్లా
మనుగడని ఊపిరాడించే
మమతల కౌగిళ్ళు కావాలి

ఎడారి వేడి ఇసుకలో
తడియారే గొంతుని తడిపే
ప్రేమ చిలకరింపు కావాలి

ఆహ్వానపత్ర హరితాన్ని
గుప్తపరుచుకున్న
చెట్టునీడలాంటి
నీ ఆగమనం కావాలి.

('సమాచారమ్' సుబ్రహ్మణ్యంగార్కి ఆత్మీయంగా)

- పురాణపండ శ్రీనివాస్